


## 2



# ప్రశాంతత

— అంతర్యామి నవీన

అప్పుడే నిద్రలేచిన అరవింద్ బ్రష్ చేసుకొని, వాళ్ళింటి డ్రాయింగ్ రూంలో కూర్చొని ఆరోజొచ్చిన వార్తాపత్రికను తిరిగేస్తున్నాడు.

లోపల హాల్లో అరవింద్ మూడేళ్ళ కూతురు సృజన ఇంటి టాప్ లేచిపోయేలా యేదో కావాలని బిగ్గరగా యేడుస్తోంది.

"స్కూలుకు టైమయిపోతోంది. నిన్న హోంవర్క్‌చేసి నా బ్యాగ్‌లో పెట్టుకున్న నా రెండు నోట్‌బుక్స్ కనిపించటంలేదమ్మా..." అంటూ బిగ్గరగా అరుస్తున్నాడు అరవింద్ యేడేళ్ళ కొడుకు సుమన్.


"ఒరేయ్! నేనొచ్చి చూసిస్తాగానీ వాటికోసం వెతుకుతూ ఇల్లు తీసి పందిరేయకు" అంటోంది వంటగదిలో సుమన్ కోసం లంచ్‌బాక్స్ ప్రిపేర్ చేస్తున్న అరవింద్ భార్య అనూష.

అయినా సుమన్ తన నోట్‌బుక్స్ కోసం ఇల్లంతా వెతుకుతూ సర్దిపెట్టిన సామాన్లన్నీ చిందరవందర చేసేస్తున్నాడు.

"నా నోట్‌బుక్స్ నువ్వే తీశావు... నా స్కూలు బస్సొచ్చేటైమయింది. త్వరగా ఇవ్వవే రాక్షసీ!" అంటున్నాడు సుమన్ వాళ్ళ చెల్లెలు సృజనతో.

"నేను నీ నోట్‌బుక్స్ తీయలేదు" అంటూ సృజన పెద్దగా అరుస్తోంది.

"నువ్వే తీశావు" అంటూ సుమన్ సృజన జుట్టు పట్టుకున్నాడు.



''నేను తీయలేదురా కుక్కా!" అంటూ సృజన సుమన్ జుట్టు పట్టుకుంది. పేపర్ చదువుకుంటున్న అరవింద్‌కు వాళ్ళ అరుపులు వింటుంటే తన ఇల్లో నరకంలా కనిపించింది.

వాళ్ళిద్దరలా పోట్లాడుకుంటుండగానే వంటింట్లోంచి

"అయ్యో...ఇప్పుడెలా?" అన్న అనూష కేక వినిపించింది.

"యేమైంది?" అన్నాడు అరవింద్ పేపర్ చదవటం కాస్సేపు ఆపేసి.

''గ్యాసయిపోయిందండి... ఇప్పుడెలా? మన ఫ్రెండ్స్ ఎవరన్నా సిలిండర్ ఇస్తారేమో ట్రై చేస్తాను" అంటూ అనూష ఒకరి తర్వాతొకరికి వాళ్ళ ఫ్రెండ్స్‌కు "మీ ఇంట్లో స్పేర్ సిలిండర్ ఉందా?" అంటూ ఫోన్ చెయ్యసాగింది. అందరూ లేదనే సమాధానం చెప్పారు. ఒక్క ప్రమీల మాత్రం ''ఉంది... మీహబ్బీని పంపించు ఇస్తా" అంది.

"యేమండీ! ఓ చిన్న సహాయం చేస్తారా?" అంది అనూష డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్న భర్త దగ్గరకొచ్చి.

"వాళ్ళిద్దరలా కొట్టుకుంటూ ఇంటి టాప్ లేచిపోయేలా గోల చేస్తోంటే పట్టించుకోకుండా నా దగ్గరకొచ్చావా? యేం సహాయం కావాలి నీకిప్పుడు" అన్నాడు అరవింద్ విసుగ్గా.

"సడెన్‌గా వంట మధ్యలో మన సిలిండర్ గ్యాసయిపోయిందండీ! మన ప్రమీల వాళ్ళింట్లో స్పేర్ సిలిండర్ ఉందిట. కాస్త వెళ్ళి తీసుకొస్తారా?" అంది అనూష.

"ఎలా తీసుకురమ్మంటావు? నా నెత్తిమీద పెట్టుకొని మోసుకురానా?" అన్నాడు అరవింద్ కోపంగా పేపర్లోంచి తలెత్తకుండానే.

"మోసుకు రావొద్దండి... మీ బైక్‌మీద ప్రమీల ఇంటికెళ్ళండి. వెళ్ళేటప్పుడు మీ వెంట ఒక ఆటోను మాట్లాడుకొని తీసికెళ్ళండి. ఆ ఆటోలో సిలిండర్ వేయించుకు రండి" అంది అనూష బతిమాలుతున్న ధోరణిలో.

''నిద్ర లేచానో లేదో ''ఇదిలేదు'' ''అదిలేదు'' అని నావెంట పడటం నీకు మామూలయిపోయింది. నేనిప్పుడెక్కడికీ వెళ్ళను... నన్నిలా వదిలెయ్... మొదలు ఇంటిని ఓ ఫిష్ మార్కెట్‌లా మార్చేస్తున్న వాళ్ళ నోళ్ళు మూయించు...'' అన్నాడు అరవింద్ చాలా విసుగ్గా.

"అది లేదు ఇది లేదు అని ఎప్పుడన్నాను. ఎందుకలా అంటున్నారు... ఈ ఒక్కరోజు ప్రమీల ఇంటికెళ్ళి సిలిండర్ తెచ్చి పెట్టండి చాలు. మిమ్మల్నింకేమీ అడగను".


నీకెన్ని తెచ్చిపెట్టినా ఎప్పుడూ గ్యాసయిపోయిందనో, ఉల్లిగడ్డలు లేవనో, పచ్చిమిరపకాయలు లేవనో, అల్లం లేదనో, వంటనూనె లేదనో అంటూనే ఉంటావు. మరుక్షణంలో బయటకు వెళ్ళి వాటిని తెమ్మని నన్ను పురమాయిస్తూనే ఉంటావు. నన్నో అరగంటసేపు కూడా ప్రశాంతంగా ఉండనీయవు. ఆ పిల్లల అరుపులతోటే నాకు పిచ్చెక్కుతున్నదంటే మధ్యలో నీగోల"

"ఉన్నా లేవని చెప్పడానికి నాకేమన్నా పిచ్చనుకుంటున్నారా? మీరిప్పుడు ప్రమీల ఇంటికెళ్ళి సిలిండర్ తెస్తారా? లేదా?"

"ఇప్పుడు నాకు బయటకెళ్ళే మూడ్ లేదు. ఈ ఒక్కపూటకు ఎలాగో అడ్జస్ట్ చేసుకో..."

"ఎలా అడ్జస్ట్ చేసుకోనూ? వాడికి, మీకు లంచ్ బాక్స్‌లో ఏం పెట్టను? ప్రమీల ఇల్లు చాలా దగ్గరేకదా! ఐదు నిమిషాలు కూడా పట్టదు. దార్లోనే ఓ ఆటో మాట్లాడుకొని వెళ్ళండి ప్లీజ్!"

"నో ప్లీజ్!... గ్యాసయిపోయిందని ఇంత సడెన్‌గా చెబుతావేమిటి? నిన్ననో మొన్ననో చెప్పొద్దా? ఐదారురోజుల క్రితమే మనం గ్యాసుకోసం బుక్ చేశాం కదా... రెండు మూడు రోజుల్లో పంపిస్తామన్నారు. ఈరోజు తప్పకుండా వస్తుంది. కొంచెం ఓపిక పట్టు"



''ఓపిక వద్తే వంటెలా అవుతుందండి? సుమన్‌కు లంచ్‌బాక్స్ పెట్టివ్వకపోతే వాడు లంచ్ టైమ్‌లో యేం తింటాడు?"

''వాడికో పది రూపాయలివ్వు... యేవైనా స్నాక్స్ కొనుక్కొని తింటాడు"

"బయట కొనుక్కొని తినే స్నాక్స్ గానీ, ఫాస్ట్‌ఫుడ్స్ గానీ వాడికి పడవని, ఇన్‌ఫెక్షన్ అవుతుందనీ, కోల్డ్ చేస్తుందనీ మీరే ఎన్నోసార్లు చెప్పారు... మొన్నోసారి వాడేదో సాఫ్ట్ డ్రింక్ తాగినందుకు వాడికి కోల్డ్ చేసిందని, వాడికి డబ్బులెందుకు ఇచ్చావని మీరు నామీద అరిచారు... మరిచిపోయారా?"

మర్చిపోలేదుగానీ ఈ ఒక్కరోజుకేం కాదు. వరేయ్ సుమన్... గ్యాసయిపోయిందట. ఈరోజు నీకు లంచ్‌బాక్స్ ఉండదు. యేవైనా స్నాక్స్ కొనుక్కొని లంచ్‌టైమ్‌లో తినేసెయ్... మీ అమ్మ నీకో టెన్‌రుపీస్ ఇస్తుంది. తీసుకెళ్ళు" అన్నాడు అరవింద్ లోపల సృజనతో పోట్లాడుతున్న సుమన్‌ను ఉద్దేశించి.

"మాస్కూళ్ళో స్నాక్స్ దొరకవు డ్యాడీ! లంచ్‌టైమ్‌లో మా స్కూలు మెయిన్‌గేటు మూసేస్తారు. బయటకు ఎవర్నీ వెళ్ళనీయరు. లంచ్‌బాక్స్ పెట్టకపోతే నేనసలు స్కూలుకే వెళ్ళను" అన్నాడు సుమన్.

"వెళ్ళకురా, వెళ్ళకు. ఒక్కరోజు స్కూలు కెళ్ళకపోతే కొంపలంటుకుపోవులే. పెద్దలు చెప్పిన ఒక్కమాట కూడా వినేదిలేదు. పరిస్థితులకు తగ్గట్టుగా నడుచుకునేది లేదు. మీ అమ్మే మిమ్మల్నిలా తయారుచేసింది" అన్నాడు అరవింద్ అనూషకేసి

చురచుర చూస్తూ.

''అవును... అమ్మే వాళ్ళనలా తయారుచేసింది. ఒక్కరోజు స్కూలు కెళ్ళకపోతే కొంపలంటుకుపోవు. భలే చెప్పారండీ! ఒక్క ఐదు నిమిషాలు ఆ పాడు పేపర్ పక్కనపెడ్తే మాత్రం కొంపలంటుకుపోతాయా" అంది అనూష.

"అవును... అలాగే అనుకో... నాకిప్పుడు బయటకువెళ్ళే మూడ్ లేదు. దట్సాల్!" అన్నాడతడు మళ్ళీ పేపర్లోకి తల దూరుస్తూ.

"నాకు చావొస్తే బావుండేది. మీ పీడా విరగడైపోయేది" అంటూనే అనూష లోపలకెళ్ళింది. ఆమెకు దుఃఖం వచ్చేసింది.

"నా నోట్‌బుక్స్ దొరికాయమ్మా ఈ సృజ్జే తీసి దాని బ్యాగ్‌లో దాచేసింది" అంటూ సుమన్ సృజన వీపుమీద ఓ దెబ్బ వేశాడు.

"నన్ను కొడ్తావా?" అంటూ సృజన సుమన్ మీద కలియబడి వాడి చెయ్యి కొరికేసింది.

"అమ్మా! ఇది నా చెయ్యి కొరికిందే... బ్లడ్ వచ్చేసింది" అంటూ కెవ్వుమని కేకేశాడు సుమన్.


"మొదట వాడే నన్ను కొట్టాడు... నేను కొరికాను'' అంటూ సృజన బిగ్గరగా యేడువసాగింది.


"ఇద్దరూ వెళ్ళి యేగంగలోనన్నా దూకి చావండి" అంటూ అనూష వాళ్ళిద్దర్నీ విడదీసి చెరొకటి అంటించింది.

వాళ్ళిద్దరూ ఒకేసారి ఇంకా బిగ్గరగా యేడుపు లంకించుకోవడంతో అరవింద్ పేపర్ను టీపాయ్ మీదకు విసిరేసి విసురుగా హాల్లోకొచ్చి తనూ ఆ ఇద్దరి చెంపల్ని వాయించి

''యేమిటిది? ఇదేమన్న ఇల్లా? నరకమా? నేను లేచినప్పట్నించి ఒక్కక్షణం కూడా ఊరుకోకుండా గోల చేస్తున్నారు.... ఛీఛీ! ఈ ఇంట్లో ఒక్కక్షణం కూడా ఉండాలనిపించడం లేదు. అందరూ కట్టగట్టుకొని యే బావిలోనన్నా పడి చావండి" అన్నాడు. అమ్మేకాకుండా నాన్న కూడా కొట్టడంతో వాళ్ళిద్దరు అదేపనిగా గుండెలు పగిలేటట్టు యేడ్వసాగారు. వాళ్ళతోపాటు అనూష కూడా ఓ మూల కూర్చొని యేడ్వటం మొదలెట్టింది.

"నీకసలు పిల్లల్ని పెంచడం తెలీదు. డిగ్రీ పాసయ్యావు. యేం లాభం? ఇంటినీ, పిల్లల్నీ అర్డర్‌లో పెట్టుకోవడం తెలీదు. నీకో పద్ధతి లేదు... పాడులేదు. గ్యాసయిపోవస్తున్నదని కాస్త ముందే తెలుసుకోలేవా? పిల్లల్ని ఇలా అనుక్షణం అల్లరి చెయ్యకుండా క్రమశిక్షణతో పెంచుకోలేవా? అన్నింటికీ భర్తేకావాలా? క్షణాల మీద బయటకు వెళ్ళి నీకు సిలిండర్ తెచ్చిపెట్టాలి. క్షణాల మీద బయటకు పరిగెత్తి కూరగాయలు తెచ్చిపెట్టాలి. పిల్లలు తుమ్మినా, దగ్గినా వాళ్ళను క్షణాల మీద డాక్టర్ దగ్గరకు తీసికెళ్ళాలి. వాళ్ళకు యేది కావాలంటే అది క్షణాల మీద తెచ్చిపెట్టాలి. నేనూ మనిషినే... పొద్దున తొమ్మిదింటికి ఆఫీసుకెళ్తే మళ్ళీ రాత్రి తొమ్మిదింటికి ఇంటికొస్తాను. నేను పనిచేస్తున్న బ్యాంకులో అనుక్షణం ఎన్ని టెన్షన్స్ ఉంటాయో నీకు తెలుసా? ఇంటికొచ్చేటప్పటికే మెంటల్‌గా, ఫిజికల్‌గా ఎంత అలసిపోయి వస్తానో నీకు తెలుసా? అలసిపోయి ఇంటికొచ్చిన వాడికి కాస్తా విశ్రాంతి నిద్దాం... ఇంటిని కాస్తా ప్రశాంతంగా ఉంచుదాం అన్న జ్ఞానం నీకుందా? ఆఫీసుకు వెళ్ళేముందు గోలే... ఆఫీసు నుండి ఇంటికొచ్చాక గోలే.. యేమన్నా అంటే ఈ యేడుపొకటి... నిన్నూ, నీ పిల్లల్ని యేడిపిస్తున్నానన్న





అపరాధభావనని నాలో కల్గించి వేధించటం... అసలు పెళ్ళి చేసుకోవటమే... పిల్లల్ని కనటమే నేను చేసిన తప్పు. మిమ్మల్ని సుఖంగా ఉంచలేకపోతున్నానన్న అపరాధ భావనకు అనుక్షణం గురవుతూ బతుకుతున్నాను. పెళ్ళి చేసుకోకముందే నేను హాయిగా ఉన్నాను. అప్పుడు నా జీవితం ఎంతో ప్రశాంతంగా ఉండేది. మంచి మ్యూజిక్ వింటూ, మంచి పుస్తకాలు చదువుకుంటూ, మంచి సినిమాలు చూస్తూ... నాకిష్టమైన పనులన్నీ హాయిగా చేసుకుంటూ బతికేవాడిని. ఇప్పుడు వాటన్నింటికీ దూరమైపోయాను. ఈ సంసారం చేసిందానికంటే సన్యాసుల్లో కలిసిపోవటం బెటరనిపిస్తోంది. అందరూ కట్టగట్టుకొని ఎక్కడికన్నా వెళ్ళిపోండి. అప్పుడన్నా విముక్తి లభిస్తుందేమో'' ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు అరవింద్. అలా అంటూనే లుంగీ, బనియన్ మీదున్న అతడు ప్యాంట్, షర్ట్ వేసుకొని బయటకెళ్ళి పోర్టికో కిందున్న మోటారు సైకిల్‌ను స్టార్ట్ చేసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

× × ×

అతడు ఇంటినుండి బయల్దేరిన పదినిమిషాల తర్వాత ఓ హోటల్ ముందు ఆగాడు. మోటారు బైక్‌ను పార్క్‌చేసి, హోటల్లో కెళ్ళి టిఫిన్‌చేసి కాఫీ తాగాడు. ఆ తర్వాత బిల్లు చెల్లించి అతడు పనిచేస్తున్న బ్యాంకుకు వెళ్ళిపోయాడు.

బ్యాంకులో ప్రవేశించి మళ్ళీ బయటకొచ్చేంత వరకు అతడికి బ్యాంకుకు సంబంధించిన పనులు చెయ్యడం తప్ప మరో విషయాన్ని గురించి ఆలోచించే తీరికే దొరకలేదు.

రాత్రి తొమ్మిదింటికి బయటకొచ్చి ఇంటికి బయల్దేరాడు.

అనూష ఎలాగో సుమన్ను స్కూలుకు పంపించే ఉంటుంది. కాస్సేపు యేడ్చి సృజన కూడా యే ఆటలోనో... లేక యే టీ.వీ ఛానెల్లోనో మునిగిపోయి ఉంటుంది. అనూష వాళ్ళ ఫ్రెండ్ ప్రమీల ఇంటికెళ్ళి గ్యాస్ సిలిండర్ తెచ్చుకునే ఉంటుంది. లేక ఈలోగా తమకు రావలసిన సిలిండర్‌నే గ్యాసు కంపెనీవారు డెలివర్ చేసుంటారు. ప్రతీదానికి తొందరే. ఒక అరగంట కూడా వెయిట్ చెయ్యదు.... సిలిండర్‌ను వెంటనే క్షణాల్లో తెచ్చిపెట్టండని ఉదయం ఆర్భాటం చేసింది. అనూషకెప్పుడూ టెన్షనే... ఒక్క అనూషే కాదు.... అనూషలాంటి గృహిణులందరికీ ఎప్పుడూ టెన్షన్సే... సిలిండర్‌లో గ్యాస్ అయిపోతుందని... మరో సిలిండర్ వెంటనే వస్తుందో రాదోనని... పిల్లల్ని కరెక్ట్ టైమ్‌కు స్కూలుకు పంపించగల్గుతామో లేదోననీ... మున్సిపాలిటీ వాళ్ళు రెండ్రోజుల కొకసారైనా నీళ్ళిస్తారో లేదోనని... యేక్షణంలో పవర్ బ్రేక్‌డౌన్ అవుతుందోనని... పిల్లలు సరిగ్గా పరీక్షలు రాస్తారో లేదోనని... హోమ్‌వర్క్ సరిగ్గా చేస్తారో లేదోనని... తమ పిల్లలకు పక్కింటి పిల్లలకంటే ఎక్కువ మార్కులొస్తాయో లేదోనని... వీటన్నింటికి తోడు చేసుకున్నవాడు తమ మాట వింటాడో లేదోనని... తనకెక్కడ దూరమైపోతాడోననీ, ఇంట్లోకి కావలసిన సరుకుల్ని తెచ్చి పెడ్తాడో లేదోనని.... ఈ సెన్సాఫ్ ఇన్‌సెక్యూరిటీ నిరంతరం వాళ్ళను వెంటాడుతూనే ఉంటుంది. యే పనైనా సరే... వాళ్లు అనుకున్నట్టుగా జరుగుతుందో లేదోనన్న భయం వాళ్ళనెప్పుడూ పీడిస్తూనే ఉంటుంది. అలా అని ఓ పనిచేసే ముందు ఆపని ఎలా చెయ్యాలో ఆలోచించరు. ఓ ప్లాన్

వేసుకోరు. ఎక్కడ యే పొరపాటు జరిగినా భర్తల్నే నిందిస్తారు. భర్త అనేవాడు వాళ్ళకో బలిపశువులా, విప్పింగ్‌బోయ్‌లా కనిపిస్తాడు. అందరూ ఆడవాళ్ళమీద సానుభూతి చూపించేవాళ్ళే... భర్తలే వాళ్ళకు విలన్సయిపోయారు. భర్తల కష్టాల్ని పట్టించుకునేవాళ్ళే లేరు.

ఇలా ఆలోచిస్తూ అరవింద్ తనిల్లు చేరుకున్నాడు.

ఇంటికి తాళం వేసి ఉంది. ఇంత రాత్రివేళ పిల్లల్ని తీసుకొని అనూష ఎక్కడికి వెళ్ళుంటుంది?

వాళ్ళ పక్కింటి శ్యామల అరవింద్‌ను చూడగానే తాళపుచెవులతో వాళ్ళింట్లోంచి బయటకొచ్చి "వీటిని అనూష మీరు రాగానే ఇవ్వమంది" అంటూ అరవింద్ ఇంటి తాళపుచెవుల్ని అతని చేతికిచ్చింది.

"అనూష ఎక్కడికెళ్ళిందో మీకు తెలుసా?" అన్నాడు అరవింద్ ఆమె ఇచ్చిన తాళపుచెవుల్ని అందుకొని.

"తెలీదండి... ఈ కీస్ మీకివ్వమంది... అంతే. ఇంకేం చెప్పలేదు" అంటూ శ్యామల వాళ్ళింట్లోకి వెళ్ళిపోయింది.

అరవింద్ తనింటి తలుపులు తెరచుకొని ఇంట్లో ప్రవేశించాడు. ఎక్కడికెళ్ళుంటుంది? అన్న ప్రశ్న అతని బుర్రను తొలిచేస్తూనే ఉంది.

ఇల్లంతా చాలా ప్రశాంతంగా ఉంది. ఎప్పుడూ ఈ ఇల్లు ఇంత ప్రశాంతంగా ఉంటే ఎంత బావుండునో అనుకున్నాడు.

అనూష పిల్లల్ని తీసుకొని తన ఫ్రెండ్ ప్రమీల ఇంటికి వెళ్ళుంటుంది... త్వరలోనే వచ్చేస్తుంది. రాగానే వాళ్ళిద్దరు చిన్న రాక్షసులు యేదో సమస్యను సృష్టించుకొని తగువులాడుకోవడం మొదలెట్టి క్షణంలో ఇంటిని నరకంగా మార్చేస్తారు... అనుకుంటూ అతడు బట్టలు మార్చుకొని, మొఖం కడుక్కొని టీ.వీ ముందుకొచ్చి కూర్చున్నాడు. తనకిష్టమైన న్యూస్‌ఛానెల్ పెట్టుకొని చూస్తూ కూర్చున్నాడు.

పిల్లలున్నప్పుడు తననెప్పుడూ ఇలా తనకిష్టమైన ఛానెల్ పెట్టుకొని చూడనివ్వరు. మూడేళ్ళకే సృజనకు టీ.వీలో యేయే ఛానెల్స్ వస్తాయో... వాటిల్లో తనేది చూడాలో తెలిసిపోయింది. దానికి అప్పుడే కొన్ని గాఢమైన ఇష్టాయిష్టాలేర్పడ్డాయి. అది కార్టూన్ నెట్‌వర్క్ తప్ప మరో ఛానెల్ చూడదు. తనొచ్చి కాస్సేపు యేదన్నా న్యూస్‌ఛానెల్ పెట్టుకోబోతే ఇల్లంతా అదిరిపోయేలా యేడ్చేస్తుంది. నుమన్‌గాడికేమో క్రికెట్టో...హిందీపాటల ఛానెల్సో కావాలి. 'నాకీ ఛానెల్ కావాలంటే, 'నాకీ ఛానెల్ కావాల'ని వాళ్ళిద్దరు ఎప్పుడూ గొడవ పడటం... కొట్టుకోవడం... ఇద్దరూ రిమోట్ కంట్రోల్ కోసం ఒకరితో ఒకరు కలియబడటం... తనొచ్చి ఇద్దర్నీ కోప్పడి తనకిష్టమైన ఛానెల్ పెట్టుకోబోతే "వాళ్ళు పిల్లలు కదా... వాళ్ళలాగే మీరూ ప్రవర్తిస్తే ఎలా?" అంటుంది అనూష. అనూష ఎప్పుడూ పిల్లల్నే వెనకేసుకొస్తుంది. ఒక్కసారి కూడా "కాస్సేపు నాన్నను టీ.వీ చూడనివ్వండి" అని పిల్లలకు చెప్పదు. ఈ ఆడవాళ్ళకు భర్తలకంటే పిల్లలే ఎక్కువ. వాళ్ళనెవరైనా "భర్తా... పిల్లలు... వీళ్ళల్లో నిజంగా మీరు ఎవరికెక్కువ ప్రిఫరెన్స్ ఇస్తార"ని అడిగితే 'పిల్లలకే'అని వెంటనే సమాధానం చెబుతారనిపిస్తుంది.

ఓ గంట గడిచిపోయింది.

"వీళ్ళింకా రారేమిటి?" అనుకున్నాడతడు. గోడగడియారం వైపు చూసి పది దాటుతోంది. ఇంత రాత్రిదాకా వాళ్ళు ఇంటికి రాకపోవడమేమిటి?

అతడు వెంటనే ప్రమీలకు ఫోన్‌చేసి "అనూష మీ ఇంట్లో ఉందా?" అని అడిగాడు.

"అనూష మా ఇంట్లో ఎందుకుంటుంది? మార్నింగ్ మీ ఇంట్లో స్పేర్ సిలిండర్ ఉందా? అని అడిగితే ఉందన్నాను. అరవింద్ వస్తాడు... ఇవ్వమంది.... అలాగే అన్నాను. నువ్వొస్తావేమోనని చూశాను. రాలేదు...." అంది ప్రమీల.

"మా సిలిండర్ వచ్చినట్టుంది... అందుకే నేను రాలేదు... అనూష ఇంట్లో లేదు. ఎక్కడికెళ్ళుంటుంది?"

"అది మీకు తెలియాలి. ఈజ్ ఎనీథింగ్ రాంగ్?" అంది ప్రమీల.

నథింగీజ్ రాంగ్..." అన్నాడు అరవింద్... వెంటనే ఫోన్ పెట్టేశాడు. నథింగీజ్ రాంగ్ అన్నాడే గాని "సమ్ థింగ్ మస్ట్‌బీరాంగ్" అని అతని అంతరాత్మ చెప్పింది.

అనూష వాళ్ళ మేనత్త ఇంటికి ఫోన్ చేశాడు. అక్కడికీ రాలేదనే సమాధానం. ఇంకో ఇద్దరు అనూష ఫ్రెండ్స్‌కు ఫోన్ చేశాడు. 'రాలేద'న్నారు.

అనూష వాళ్ళ పుట్టింటికి వెళ్ళిపోయుంటుంది. ఉదయం తనన్న మాటలకు హర్టయి ఉంటుంది. నువ్వూ, పిల్లలూ ఇంట్లో లేకపోతేనే ఇల్లు ప్రశాంతంగా ఉంటుందన్నట్టుగా మాట్లాడాడు. పిల్లలు చేసే గోల భరించలేక చాలాసార్లు అనూషతో "నీకు పిల్లల్ని క్రమశిక్షణతో పెంచడం చేతకాద"న్నాడు. "పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం... తన చేసిన బిగ్గెస్ట్ బ్లండర్" అన్నాడు... "మీరందరూ కట్టగట్టుకొని ఎక్కడికైనా వెళ్ళిపొండి అన్నాడు". పాపం... చాలా హర్టయి ఉంటుంది.

అతడు వెంటనే తమ నగరానికి 20 మైళ్ళ దూరంలో ఉన్న ఆమె పుట్టినూరుకు... వాళ్ళ నాన్నగార్కి ఫోన్ చేశాడు.

# గమ్యం

## వి. సూర్యారావు

**బ**తకాలంటే బతుకు
బండి చక్రమయి దొర్లుతూ వుండాలి.
చక్రం బలంగా ఉండాలి
బరువుల్నీ బాధల్నీనింపుకొని
గతుకుల్లోనూ
రాళ్ళల్లోనూ
నీళ్ళల్లోనూ కుంటు పడకుండా పయనం
సాగిస్తూనే వుండాలి.
ఉదయం
మధ్యాహ్నం
సాయంత్రం
తేడాలు చూడకుండా చూపకుండా
శ్రమిస్తూ సాగిపోతూనే వుండాలి.
బండి ఆటుపోట్లకీ
ఎదురు దెబ్బలకీ
కమిలిపోకుండా కుమిలిపోకుండా
నిశ్చింతగా నిర్భయంగా
గుండె దిటవుగా
కదిలిపోయి ఉండాలి
దారిపొడవునా
నిజాలుంటాయి
అబద్ధాలుంటాయి
అవినీతులుంటాయి
అయినాసరే
ప్రతిసారీ తననుతాను
హత్య చేసుకుంటూ
పయనిస్తూనే ఉండాలి.

"మామగారూ, అనూష, పిల్లలు అక్కడికొచ్చారా" అన్నాడు.

వచ్చారు... స్కూల్స్‌కు ఐదారురోజులు సెలవులిచ్చారట కదా! యేవో ఆందోళనలు, గొడవలు జరుగుతున్నాయట కదా... స్కూల్స్ మూసేశారట కదా! అనూష నీకు చెప్పలేదా?" అన్నాడు అనూష వాళ్ళ నాన్న.

అరవింద్ వెంటనే ఫోన్ పెట్టేశాడు. పుట్టింటికెళ్ళిపోతుందా? తనేమన్నానని? ఎప్పుడూ అనేమాటలే కదా! ఈరోజు మరీ హార్ష్‌గా అన్నాడేమో... అయితే మాత్రం తనతో చెప్పకుండా వెళ్ళిపోతుందా? ఎంత సాహసం!

ఆడదానికి... ఆమెకే అంత రోషముంటే తనకెంత ఉండాలి? ఆమంతట ఆమె తిరిగొస్తే తప్ప తను ఆమెకోసం పరిగెత్తకూడదు... ఆమె లేకుండా తను బతకలేడా?

వంటగదిలోకెళ్ళి కొత్త సిలిండర్ వచ్చిందో లేదో చెక్‌చేశాడు. థాంక్ గాడ్! వచ్చింది.

అతడు స్టౌ ఆన్‌చేసి కుక్కర్ పెట్టుకొని అన్నం వండుకున్నాడు. ఓ ఆమ్లెట్ వేసుకొని భోజనం చేశాడు. ఆమె లేకుండా తను బతకగలనని రుజువు చెయ్యాలి.

డీ.వీ.డీ ప్లేయర్లో తనకిష్టమైన ఇంగ్లీషు సినిమా వేసుకొని అర్ధరాత్రి దాకా చాలా చక్కటి శృంగార దృశ్యాలున్న ఆ సినిమా చూస్తూ గడిపాడు. వాళ్ళుంటే తననిలా ఇంతమంచి సినిమాను చూడనిచ్చేవాళ్ళా? అనూషకెప్పుడూ తెలుగు సినిమాలే కావాలి. పాడు ఇంగ్లీషు సినిమాలెందుకంటుంది. తనకిప్పుడు చాలా హాయిగా ఉందనుకున్నాడు. అర్ధరాత్రి దాటాక పడుకొని నిద్రపోయాడు.

ఆ మర్నాడు నిద్రనుండి లేవగానే ఇల్లెంత ప్రశాంతంగా ఉందో!' అనుకున్నాడు అతనికిష్టమొచ్చినంత సేపూ పక్కమీద అటు ఇటు దొర్లుతూ పడుకున్నాడు. అనూష ఉంటే తనను బలవంతంగా లేపి కూరగాయలు తెమ్మని పంపించేది. తర్వాత లేచి బ్రష్ చేసుకొని బయటి డోర్ దగ్గర పడిఉన్న ఆరోజు పేపర్ని, పాల పాకెట్‌నూ తెచ్చుకొని, పేపర్ను టీపాయ్ మధ్య పడేసి కాఫీ చేసుకొని తాగాడు. తర్వాత కాస్సేపు న్యూస్‌పేపర్ చదివాడు. తర్వాత కాస్సేపు టీ.వీ. చూశాడు. తర్వాత స్నానం చేసి, ఫ్రిజ్‌లో ఉన్న బ్రెడ్ అండ్ బట్టర్‌తో బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. లంచ్ టైమ్‌లో వాళ్ళ బ్యాంకు దగ్గరున్న ఓ మెస్‌లో భోజనం చేశాడు. రాత్రిపూట తనే వంట చేసుకొని భోజనం చేశాడు.

వరసగా మూడురోజులూ ఇలాగే గడిచిపోయాయి. తను ఎంతగానో కోరుకున్న ప్రశాంతత లభించిందనుకున్నాడు.

"ఒక్కరే... ఎలా ఉంటున్నార"ని అనూష ఫోన్ చెయ్యడమో... లేక పిల్లల్ని తీసుకొని తనే వచ్చెయ్యడమో జరుగుతుందనుకున్నాడు. సుమన్ ఒక్కరోజు స్కూలు కెళ్ళకపోయినా అనూష ఎంతో అప్సెట్ అయిపోతుంది. అలాంటిది, మూడు రోజులైనా ఆమె తనకోసం కాకపోయినా వాడి స్కూలు కోసమన్నా రాకపోవడం అతన్ని ఆశ్చర్యపరచింది. ఎన్ని రోజులు రాకుండా ఉంటుందో తనూ చూడాలనుకున్నాడు.

నాల్గోరోజు సడెన్‌గా... ఇల్లంతా బావురుమంటున్నట్టుగా తోచిందతనికి. చాలా ఒంటరివాడినైపోయానన్నట్టుగా ఫీలయ్యాడు. ఇంట్లో తాండవిస్తున్న ప్రశాంతత అతన్ని విసిగించసాగింది.

రాత్రి పడుకుంటున్నప్పుడు అతని పక్కన అనూష లేకపోవడం అతనికెంతో పోగొట్టుకున్నట్టుగా తోచింది. అనూషతో గడిపిన ఎన్నో మధురక్షణాలు అతనికి గుర్తొచ్చాయి. ఆ మధురక్షణాలు మళ్ళీరావా? అన్న ప్రశ్న అతన్ని కుదిపేసింది. అతనిలో మెల్లగా అంతర్మథనం ప్రారంభమయ్యింది.

పిల్లల్ని పెంచడం కేవలం అనూష బాధ్యతేనన్నట్టుగా ప్రవర్తించాడు. తన బాధ్యతను మరచేపోయాడు. అనూష చాలాసార్లంది... ఎప్పుడూ మీలోకంలో మీరే ఉంటారు తప్ప పిల్లల్నసలు పట్టించుకోరని... తనేమో నువ్వే పిల్లల్ని గారాబం చేసి చెడగొడ్తున్నావని అనేవాడు..."నేను చెడగొడ్తే మీరు బాగు చెయ్యొచ్చుకదా!" అని అనూష అంటుండేది. పిల్లల విషయంలో తండ్రికంటే తల్లికే ఎక్కువబాధ్యత ఉంటుందని తనంటూ ఉండేవాడు. తనెప్పుడైనా వాళ్ళ అల్లరి భరించలేక వాళ్ళను కోప్పడ్డా, ఓ దెబ్బ వేసినా అనూష బోల్డు బాధ పడ్తుండేది. కళ్ళనీళ్ళు పెట్టుకునేది. "పిల్లల్ని ప్రేమతో జయించాలి తప్ప కోపంతో కాద"ని తనకు హితబోధ చేసేది. పిల్లలు చేసే అల్లరిని చూస్తే తనకు కోపమొస్తుందనీ, కోపమొచ్చినప్పుడు వాళ్ళనేమన్న అన్నా, ఓ దెబ్బ వేసినా నువ్వు చాలా బాధపడ్తావు కాబట్టితనిక పిల్లల జోలికి రానని తను చేప్పేవాడు. పిల్లల విషయంలో తనకు సహనం చాలా తక్కువ. పాపం! అనూష వాళ్ళు చేసే అల్లరితో ఎంత సతమతమైపోయేదో గుర్తుచేసుకుంటే అతనికి అనూషమీద చాలా సానుభూతి కల్గింది. పిల్లల విషయంలో తనామెకు ఎలాంటి సహాయం చెయ్యకపోవడం తన తప్పే అనుకున్నాడు.

నాల్గోరోజు గడిచేటప్పటికి అతనికి ఆ ఇంట్లో తాండవిస్తున్న ప్రశాంతత పిచ్చెక్కించింది. పిల్లలూ, అనూష లేకుండా తనా ఇంట్లో ఇంకొక్కక్షణం కూడా ఉండలేననుకున్నాడు.

పాపం! అనూష చాలా మంచిది. తన అసహనాన్ని, పిల్లల అల్లరిని ఎంత ఓపిగ్గా భరిస్తుందో! మగవాడినన్న అహంతో తనామెను దూరం చేసుకున్నాడు.

ఐదోరోజు... అనూష లేకుండా ఇక ఒక్కక్షణం కూడా ఉండలేననుకొని అరవింద్ అనూష దగ్గరకు పరిగెత్తుకొని వెళ్ళాడు. "సారీ అనూషా!" అన్నాడు ఆమె కనిపించగానే.

"మీకు ప్రశాంతత కావాలికదా! మేం లేనప్పుడు మీకు బోల్డు ప్రశాంతత లభించి ఉంటుంది. దాన్ని వదులుకొని మా కోసం ఎందుకు వచ్చారు?" అంది అనూష చాలా ముభావంగా.

"ఒకరి విలువ వారు పక్కన లేనప్పుడు తెలిసొస్తుంది. మీరు లేని ఈ నాల్గురోజులు నేనెంత పోగొట్టుకున్నానో అర్థమైంది. మరోసారి ఇలా జరగదు" అన్నాడతడు ఆమెను తన హృదయానికి హత్తుకుంటూ.

"మరోసారి ఇలా జరగదన్న మీ మాటను నమ్మమంటారా?" అందామె అతని కళ్ళల్లోకి చూస్తూ.

"ప్రామిస్ అనూషా! నువ్వే నాకు నిజమైన ప్రశాంతతవి" అన్నాడతడు ఆమెను తన హృదయంలో ఐక్యం చేసుకుంటూ.


**చదవండి! చదివించండి! చందాదారులు కండి!**

**చినుకు**

| | | | |
|---|---|---|---|
| సంవత్సర చందా (వ్యక్తులకు) | : | రూ. | 120/- |
| సంవత్సర చందా (సంస్థలకు) | : | రూ. | 150/- |
| 3 సంవత్సరాల చందా (వ్యక్తులకు) | : | రూ. | 330/- |
| 3 సంవత్సర చందా (సంస్థలకు) | : | రూ. | 420/- |
| 5 సంవత్సరాల చందా | : | రూ. | 500/- |
| 10 సంవత్సరాల చందా | : | రూ. | 1,000/- |
| విశిష్ట సభ్యత్వం | : | రూ. | 3,000/- |
| U.S.A | : | | 25$ |